రామానందం ఆఫీసుకి టైమ్ అయిందని త్వరగా స్నానంచేసి లోపలికి వచ్చాడు.

"వడ్డించావా?" గట్టిగా కేక పెట్టాడు.

"అప్పుడే టైమైందా?" వంట గదిలో నించే వరలక్ష్మి మూలిగింది.

"అప్పుడేనా! టైమెంతో తెలుసా? తొమ్మిదీ ముప్పావు. గడియారం ఒక్కసారి చూడు."

"మాయదారి గడియారానికి పనీ పాటా ఏముంది గనక-గిరగిరా తిరగటం తప్ప. దానంత వేగంగా నేనెక్కడ తిరగి చావను. కాస్త





ఆగితే కూర పోపులో వేస్తాను, వడ్డిస్తాను."

రామానందం విసురుగా వంట గదిలోకి వచ్చాడు. పన్నెండేళ్ళ క్రితం పెళ్ళిలో అలకపాన్పు మీద అత్తవారిచ్చిన వాచీని భార్యకి చూపించాడు. వరలక్ష్మి వాచీవైపు నిర్లక్ష్యంగా చూసి తల విసురుగా తిప్పేసింది.

"ఆ వాచీని నాలా కిర్సనాయిల్ స్టవ్ మీద వంటచేసి తొమ్మిదింటికి వండి వార్చమనండి చూస్తాను" అంది.

"వాచీలు వంట చేస్తే నీలాంటి సోంబేరి వరలక్ష్ములు పుట్టిళ్ళల్లోనే కాలం గడపాల్సి వచ్చేది. ఉన్న మాట అంటే నీకో్కపంగానీ మన పక్క వాటాలోని అరుంధతి ఎనిమిదింటికల్లా వంటచేసి మొగుడికి వడ్డించడం లేదూ?"

వరలక్ష్మికి భర్త తనని సోంబేరి అనేసరికి ఒళ్ళు మండింది. అరుంధతితో పోల్చి చెప్పేసరికి మరీ మండింది.

"ఆయనలా మీరూ ఆఫీసరా? ఆఫీసరే అయితే అలానే వండి వారుద్దును. మీలాంటి గుమాస్తాలు పది తరువాత వెళ్ళినా మరేం ఫర్లేదు." మొగుడ్ని గుమాస్తా అని కించపర్చి తన అక్కసుని తీర్చుకుంది వరలక్ష్మి. రామానందానికి పట్టరాని కోపం వచ్చింది. అయినా చివ్వున వెనక్కి తిరిగి వచ్చేశాడు.

'వెధవ పెళ్ళి ఎందుకు చేసుకున్నాను దేవుడా? ఖర్మకాలి చేసుకున్నానే అనుకో-నాకిలాంటి భార్య దొరకాలా! ఈ ప్రపంచంలో ఎందరు భార్యా భర్తలు చిలుకా గోరువంకల్లా అన్యోన్యంగా కాపురాలు చేసుకోవటం లేదు?...' రామానందం ఇలా అనుకుంటూ ఆఫీసుకి టైమ్ అవటంవల్ల పాంటూ షర్టూ వేసుకున్నాడు. చెప్పులు వేసుకుని వీధి వాకిటవరకూ నడిచాడు.

"అయినంతవరకూ వడ్డించాను. మింగి వెళ్ళొచ్చు!" వరలక్ష్మి వంట గదిలోనించే కేక పెట్టింది.

రామానందానికి వెనక్కి వెళ్ళ బుద్ధి కాలేదు. 'హోటల్లో భోజనం చేస్తే పోలా' అనుకుంటూ షర్టు జేబు తడుముకున్నాడు. రూపాయి న్నర మాత్రమే వుంది. జీతాలు అందటానికి ఇంకా వారం రోజుల టైముంది-అన్న విషయం గుర్తుకొచ్చేసరికి, అభిమానాన్ని వెనక్కి నెట్టేసి లోపలికి వచ్చేసి వడ్డించిన పళ్ళెం ముందు కూర్చున్నాడు.

అన్నం ఆవిర్లు వస్తోంది. చెయ్యీ, నోరూ కాలుతోంది. పచ్చడి మెతుకులు కలుపుకుని విసన

కర్ర తీసుకుని విసురుకుంటూ తిన సాగాడు. కారం-నోరు మండింది. గ్లాసుడు నీళ్ళు తాగేశాడు. గ్లాసు కింద పెడుతూ ఎదురుగా నిల్చున్న వరలక్ష్మి వైపు చురచురా చూశాడు. ఆమె ఏమీ ఎరగని దానిలా అమాయకంగా ముఖం పెట్టేసింది. భార్యకి తనమీద కోపం వచ్చినప్పుడల్లా వంట ఇలానే వుంటుంది. నెలలో ఇరవై అయిదు రోజులు వరలక్ష్మికి కోపం వస్తూనే వుంటుంది. రామానందానికిలా నోరు మండుతూనే వుంటుంది.

"మజ్జిగ!" అన్నాడు అరిచినట్లుగా.

"లేవు."

"ఏమైనాయి?"

"పిల్లి తాగేసింది."

'అబద్ధం-యే స్నేహితురాళ్ళో వచ్చి వుంటారు. పోసుకోలు కబుర్లు చెప్పి—చెప్పి టీలు కలిపి యిచ్చి వుంటుంది. పిల్లి తాగేసింది అని అబద్ధం చెప్పటానికి కాస్త కూడా బెదురు లేదు.'

మరో గ్లాసు నీళ్ళు తాగేసి ఆ గ్లాసుని భార్య ముఖానికి వేసి కొట్టాలనిపించినా తమాయించుకుని చెయ్యి కడిగి లేచేశాడు. అయినా వరలక్ష్మి వులకలేదు-పలకలేదు.

రామానందం చెప్పులు వేసుకుంటూంటే వెనకనించి వరలక్ష్మి అంది—"సాయంకాలం శ్యామలమ్మతో సినిమాకి వెడతాను."

"........"

"యెన్నింటికి వస్తారు?"

"చెప్పలేను."

"అలా అంటే యెలా? అయిదు కాగానే రావాలి."

"చూస్తాను."

"భార్య దగ్గర కూడా గుమాస్తా బుద్ధే."

మరో బాణం గురి చూసి విసిరింది. రామానందం గిలగిల్లాడిపోయాడు. 'గుమాస్తా! గుమాస్తా! గుమాస్తా! యేం- గుమాస్తాలు మాత్రం మనుషులు కారా?' అనుకుని భగ్గుమన్నాడు-"ఎలిమెంటరీ స్కూలు మాష్టరుగారి కూతురైన వరలక్ష్మిగారూ! ఓ ఐ.ఏ.యస్. ఆఫీసరుగారిని కట్టుకోకపోయారా? అప్పుడాయనకి నాలాంటి గుమాస్తా బుద్ధులు వుండేవి కావు. నిన్ను హంసతూలికా తల్పంమీద పరుండజేసి దాసదాసీ జనంతో సేవలు చేయించేవాడు" అన్నాడు కచ్చగా.

"నాకా అదృష్టమే వుంటే...." వరలక్ష్మి యింక ముందు అనబోయే మాట ఏమిటో రామానందానికి తెల్సు. అది విని తను భరించలేడు. చెంప ఛెళ్ మనిపించ

వల్సి వస్తుంది. ఆ తర్వాత నాలుగు రోజుల వరకూ వరలక్ష్మి ఇల్లు నరకం చేస్తుంది. అలా కావటం ఇష్టంలేక విసురుగా బైట పడ్డాడు.

ఆఫీసు దగ్గరకి వచ్చేవరకూ రామానందం భార్యని గురించి ఆలోచిస్తూనే వున్నాడు. సీటులో కూర్చుని ఫైలు తీసుకున్న తర్వాత ఇంటినీ, ఇల్లాలినీ మర్చిపోయి పనిలో మునిగిపోయాడు.

*　　*　　*

రామానందం ఆరు గంటల తర్వాత ఇంటికి వచ్చేసరికి వీధి తలుపుకి తాళం వ్రేలాడుతోంది. 'నేను రాకున్నా తను సినిమాకి వెళ్ళిపోయిందన్నమాట!' అనుకుని నిట్టూర్చి పక్క వాటా వారిని తాళం చెవి అడిగాడు.

"ఇచ్చి వెళ్ళలేదు ఎందు చేతనో?" అన్న జవాబుకి ఆశ్చర్యంతోబాటు కోపం కూడా వచ్చేసింది. కోపం వచ్చినా చేయ గలిగింది లేదు. ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయాడు.

"వరలక్ష్మిగారు తాళం చెవి యివ్వటం మర్చిపోయారేమో అని గుర్తు కూడా చేశానండీ! ఆవిడ- 'మీకా శ్రమ అక్కరలేదు. మా వారు పదింటివరకూ రారు లెండి' అనేసి వెళ్ళిపోయింది"- పక్క వాటా ఆవిడ తను చెప్పవల్సింది చెప్పి లోపలికి చక్కా పోయింది.

రామానందానికి మనసు భగ్గున మండింది. సినిమా హాలుకి వెళ్ళి భార్యని జుట్టు పుచ్చుకుని యీడ్చుకు వచ్చి చావ బాదేయాలన్పించింది. తలుపుకున్న తాళం పగులగొట్టి లోపలికి వెళ్ళి గడియ బిగించుకుని వరలక్ష్మి వచ్చినా, తలుపులు బాదినా—తెరవకుండా తెల్లవారే వరకూ వీధిలో నిలబెట్టాలన్పించింది. ఇంకా చాలా చాలా చేయాలని అన్పిస్తూనే వుంటుంది. కానీ ఒక్కటీ చేయలేకుండా వున్నాడు.

'ఛీ-ఛీ. ఏం పెళ్ళాం? ఎలా దొరికిందీ పెళ్ళాం? ఎక్కడనుంచి వచ్చిందీ పెళ్ళాం? భగవంతుడా!' సుదురు బాదుకుంటూ యిటూ అటూ పచార్లు చేయసాగాడు. పక్కవాటా ఆయన ఆఫీసునించి వస్తూ రామానందాన్నీ, వారివాటాకి వేసి వున్న తాళం కప్పనీ రెండు మూడు సార్లు మార్చిమార్చి చూసి, అర్థమైనట్లు తల ఎగరేసి మరీ పలకరించాడు.

"రామానందంగారూ! రండి-మా గదిలో కూర్చుందాం."

రామానందానికా పలకరింపు ఏదోలా అన్పించినా, విధిలేక ఆయన వెంట లోపలికి వెళ్ళాడు.

ఆయన బట్టలు మార్చుకువచ్చే సరికి ఇంటావిడ కాఫీ కప్పులు తెచ్చి యిచ్చింది.

"తీసుకోండి!" అంటూ ఆయన కప్పు చేతిలోకి తీసుకుని కబుర్లు మొదలు పెట్టాడు.

రామానందం 'హూ(' అంటూన్నాడు. కానీ మనసు మనస్సులో లేదు. 'తనకి వరలక్ష్మి యిలా ఒక్కరోజన్నా యిచ్చిందా?'

పది గంటలు కావస్తూండగా వరలక్ష్మి వచ్చి తలుపు తెరిచింది. రామానందం లేచి ఇంట్లోకి వచ్చాడు. ఆకలిగా వున్నా అన్నం తినాలని అన్పించలేదు.

"వ డ్డిం చా ను. వచ్చి మింగొచ్చు!" గొంతు అదోలా పెట్టి గోడకి చెప్పినట్లు చెప్పింది.

రామానందం జవాబు చెప్పలేదు. వరలక్ష్మి మరోసారి అడగలేదు. హాయిగా భోజనం చేసి వచ్చి పడుకుంది.

* * *

రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. రామానందానికి ప్రమోషన్ వచ్చింది. హోదా పెరిగింది. జీతం పెరిగింది. అయినా రామానందంలో కాస్త కూడా మార్పు లేదు. కానీ వరలక్ష్మిలో చాలా మార్పు వచ్చింది. అది పైకి కన్పిస్తూ వుంది. రామానందానికి వళ్ళంతా కంపరం పుడుతోంది- ఈ మార్పు చూస్తూంటే.

ఉదయం తొమ్మిది కాకముందే వంట పూర్తి అయిపోతుంది. బట్టలు వేసుకుంటున్న భర్త దగ్గరగా వచ్చి, "ఏమండీ! వంట అయిపోయింది. మీ కిష్టమైన గుత్తి వంకాయ కూర చేశాను. కొబ్బరి పెరుగు పచ్చడి చేశాను. చల్లారకపోతే మీ చెయ్యీ, నోరూ కాలతాయని ముందే ఆరబెట్టాను. అన్నట్లు రెండింటికి ప్యూన్‌ని పంపండి. కాఫీ, టిఫెనూ చేసి యిస్తాను. హోటలువి తినొద్దు. ఆరోగ్యం పాడై పోతుంది."

"ఈ రోజు కొత్తసినిమా రిలీజ్ అయిందిగా! నీకు తీరుబడి వుండదుగా?"

"ఆ(- సినిమా మీ కంటే ఎక్కువా? హాయిగా ఆదివారం ఇద్దరం కల్సి వెడదాం."

"నాకు ఆదివారం కూడా ఆఫీసు పని వుంది."

"పోనివ్వండి. మీకు తీరుబడి వున్నప్పుడే వెడదాం."

"నీ సినిమా ఫ్రెండో మరి?"

"ఆ(__ఆ స్నేహం అప్పుడు. ఇప్పుడు నేను ఆఫీసరుగారి భార్యని. ఇరుగమ్మతో పొరుగమ్మతో వెళ్ళ

వల్సిన ఖర్మ నా కేమిటి- హాయిగా మీరుండగా! అదీగాక ఆఫీసరు భార్య-ఆటోలో వెళ్ళాలి. అప్పుడు గానీ నాకు తృప్తి వుండదు."

"అలాగా! నాకు తెలియదులే."

"మీరొట్టి అమాయకులని నాకు తెల్సు.మరెవరికీ తెలియదు. ఔను-అన్నట్లు మీతో ఏదో పని వున్న దంటూ ఆ మధ్య పళ్ళు, పువ్వులు, స్వీట్లు తెచ్చిన కోటీశ్వర్రావు అంతు లేడు. ఏమైనాడండీ!"

"ఎందుకూ?"

"బంగారం లాంటి బియ్యం ఓ బస్తా తెచ్చి పడేస్తానని చెప్పాడు. అరె! అదేమిటీ చెప్పులు వేసు కుంటున్నారూ? భోజనంచెయ్యరూ? మీ కెక్కడ ఆలస్యం అయి పోతుందో అని నేను అయిదింటికే లేచి వంట చేస్తూంటే రోజూ మీ రిలా భోజనం చెయ్యకుండా వెళ్ళి పోతున్నారేమిటీ?"

వరలక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరుగు తున్నాయి. రామానందం ఒక్క క్షణం భార్య ముఖంలోకి చూశాడు. కోపాన్ని మింగేస్తూ అన్నాడు—

"చూడూ! కోటీశ్వర్రావు లాంటి వాళ్ళింక మనింటి గడప తొక్క కూడదు. నాకు తెలియకుండా ఎవ రొచ్చినా నా దగ్గరకి పంపు కానీ, నీ రికమండేషన్లు కట్టిపెట్టు. వాళ్ళేం తెచ్చినా లోపలకి రానీ యకు. తెలుసా? నువ్వు నా కోసం చాలా శ్రమపడి వంట చేశావు. కానీ, ఒక్క విషయం మర్చి పోతున్నావు. నాకు ఆకలిగా వున్నప్పుడూ, జేబులో డబ్బులు లేనప్పుడూ, నీ వంట నాకెంతో అవసరం అయినప్పుడూ- నీ వది గుర్తించలేదు. ఇప్పుడు నా జేబులో డబ్బుంది. అది ఏది కావా లన్నా తెస్తుంది" అనేసి, చకచకా ఆఫీసుకి వెళ్ళిపోతున్న భర్తవైపు కళ్ళప్పగించి చూస్తూ వుండి పోయింది వరలక్ష్మి.

మరి కొన్ని రోజులు గడిచి పోయాయి. రామానందం ఉదయం ఎనిమిది గంటలకే బైటకి వెళ్ళి రాత్రి పది తర్వాతగానీ ఇల్లు చేరటం లేదు.

ఇదంతా చూసి చూసి ఓ రోజు వరలక్ష్మి భర్తతో తగూకి దిగింది. "ఈ మధ్య మీ పద్ధతి ఏం బాగా లేదు" అంది విసురుగా వచ్చి.

"ఏం? ఏం చేశాను?"

"ఏం చేశాను అని అలా అమాయకంగా అడక్కండి. మీరు మీ ఆఫీసులోని శకుంతలతో సినిమాలకీ, షికార్లకీ తిరుగుతున్న విషయం నిజమేనా?"

"ఎవరు చెప్పారు?"

"పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ తన్నెవరూ చూడలేదు అనుకుంటుందిట. అలాగే మీరూ. చూడండీ! మీరిలా తిరుగుతూంటే నే చస్తే వూరుకోను. దానింటికి వెళ్ళి, దాని అంతు చూస్తాను."

"వరలక్ష్మీ!"

"మీరు గొంతు చించుకుని అరిస్తే నే భయపడను. మీకంటే యింకా బిగ్గరగా అరుస్తాను. మీ ఇద్దరి పరువూ తీస్తాను."

"లక్ష్మీ!" రామానందం ఆవేశంతో దగ్గరగా వచ్చేశాడు.

"దానితో మీరు తిరిగారంటే వురెట్టుకు చస్తాను. రేపీపాటికి నా శవం దూలానికి వేలాడుతుంది. నా మాటంటే మాటే!" ఆవేశపడ సాగింది వరలక్ష్మి.

రామానందానికి ఆవేశంతో వళ్ళు తెలియలేదు. అంతే! వరలక్ష్మి చెంపలు చెళ్ చెళ్ మని పించేశాడు.

వరలక్ష్మికి యేడుపు రాలేదు ఈసారి. భయంతో బిగుసుకుపోయింది. 'నా మొగుడ్ని గుమాస్తాగానే వుంచక ఆఫీసర్ని ఎందుకు చేశావు దేవుడా! ఆఫీసరు అయ్యేసరికి ఆడాళ్ళు వెంటబడి నాక్కాకుండా చేస్తున్నారు దేవుడా!' అనుకుని లోలోపల కుమిలిపో సాగింది.

భార్య చెంపలు వాయించినా ఆవేశం తగ్గని రామానందం జుట్టు పీక్కుంటూ యిటూ అటూ పచార్లు చేయసాగాడు.

వరలక్ష్మి యేడుస్తూనే శకుంతలని తిట్టసాగింది. "పెళ్ళి కాకుండా ముసలికన్యల్లా ఆఫీసుల్లో చేరిన ఈ చదువుకున్న శకుంతల్లాంటి అమ్మాయిలు నాలాంటి యెన్ని కాపురాల్లో నిప్పులు పోస్తున్నారో దేవుడా!"

"వరలక్ష్మీ! ఒక్కసారి నీ యేడుపు ఆపి నే చెప్పేది విను. వినకపోయావా- నాలుగు తన్ని విని పిస్తాను. తెల్సునా?" కళ్ళెర్రజేసి బెదిరించాడు. వరలక్ష్మి కాస్త తగ్గించింది యేడుపుని.

"చూడూ! కాపురానికి వచ్చిన దగ్గర నుంచీ చీటికీ మాటికీ చస్తానంటూ బెదిరించి నన్ను లొంగ దీసి, నీ యిష్టం వచ్చినట్లు సంచరించావు. ప్రమోషన్ రానంత వరకూ 'గుమాస్తా .... గుమాస్తా' అంటూ శూలాల్లాంటి మాటలతో నా మనస్సుని తూట్లు పొడిచావు. ఆఫీసరు కాగానే హారతి పట్టావు. కానీ వరలక్ష్మీ! భార్యాభర్తల మధ్య వుండవల్సిన అసలైన సంబంధాన్ని నువ్వసలు అర్థం చేసుకోలేదు.

కష్టంలో సుఖంలో ఒక్కటిగా మెలుగుతూ తోడూ నీడగా బ్రతుకు సాగించాలనే సత్యాన్ని నువ్వు గుర్తించలేదు. దీన్ని భరించలేని నేను అశాంతితో వేగిపోతూ కావాలనే ఆఫీసులో ఎక్కువ కాలం గడపసాగాను. ఆ సమయంలోనే నాకు శకుంతలతో పరిచయం పెరిగింది. నిజం చెప్పాలంటే ఎప్పుడూ చిరునవ్వుతో వుండే శకుంతల నన్ను ఆకర్షించింది. ఇల్లు నరకం చేస్తున్నావనే నీ మీది కోపంతో, అసహ్యంతో నీకు బుద్ది చెప్పాలని శకుంతలకి మరీ దగ్గర కావాలని ప్రయత్నించాను.

"నాకు పెళ్ళి అయిందని తెలియని శకుంతల నాకు దగ్గరగా రాసాగింది. ఆఫీసులో గుసగుసలు ప్రారంభమైనాయి. ఇది నాకు చికాకు కలిగించింది. ఈ సమస్యని పరిష్కారం చేయాలని శకుంతలని ఒక రోజు సూటిగా అడిగేశాను-

"'నాకు ఇదివరకే ఒక పెళ్ళి అయిందనీ, ఒక భార్య వుందనీ నీకు తెలియదు. అయినా చెప్తున్నాను- నా ఇంట్లో శాంతి లేదు. ఆ శాంతి నీ దగ్గర నాకు దొరుకుతోంది. అందుకే నిన్ను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటూన్నాను. ఈ పెళ్ళికి చట్టం ఒప్పుకోదు. కనుక రహస్యంగా చేసుకుందాం. ఏమంటావ్?'

"నాకు పెళ్ళి కాలేదనుకొని ఆ భ్రమతో దగ్గరైన శకుంతల మొదట తెల్లబోయింది. ఆవేదన పడింది. ఎంతో కష్టంమీద తనని తను సంబాళించుకుంది. చివరికి ఏమన్నదో తెలుసునా?.." క్షణం ఆగాడు రామానందం.

వరలక్ష్మి ఏడవటం మరిచిపోయింది. దడదడలాడే గుండెని అదిమి పట్టుకుని కళ్ళప్పగించి చూడసాగింది.

"వృద్ధకన్య అంటూ నువ్వు ఛీదరించుకున్న ఆ శకుంతల ఏమన్నదో తెలుసునా? తనకి పెళ్ళి కాకున్నా ఫర్లేదన్నది. తోటి స్త్రీ జీవితంలో నిప్పులు పొయ్యలేనన్నది. జీవితాంతం ఇలా వృద్ధకన్యలా వుండిపోవటానికి సిద్ధపడతానుగానీ, ఓ ఇల్లాలి కన్నీళ్ళకి కారణం కాను అన్నది. నీ భార్యకి బుద్ధి లేక పోయినా నీకు బుద్ధి వుండాలని నన్ను చీవాట్లు పెట్టింది. నిన్ను నాకు నచ్చేలా తీర్చిదిద్దుకోమని సలహా ఇచ్చింది. మన కాపురం సంతోషంగా సాగిపోవాలని భగవంతుడిని కోరుకుంటానన్నది. ఇంత మంచి మనసున్న దేవతలాంటి శకుంతలని నువ్వు ఏమన్నావ్! ఎన్ని కారు

కూతలు కూశావ్! నీకు మళ్ళీ దగ్గర కావాలని ప్రయత్నించే నా మనసుని నీమాటలతో ఎంత గాయపరిచావ్!"

వరలక్ష్మి కళ్ళనుంచి జలజలా నీళ్ళు వర్షించాయి. క్షణం తెల్లబోయి చూసింది. "మీరు చెప్పింది అంతా నిజమేనా! అయ్యో! నా తప్పుని క్షమించమని ఆ శకుంతలని వేడుకుంటాను. నన్నిప్పుడే ఒక్కసారి తీసుకువెళ్ళండి."

"ఇంకెక్కడ వుంది శకుంతల! ట్రాన్స్‌ఫర్ చేయించుకునే ప్రయత్నంలో శలవు పెట్టి వెళ్ళిపోయింది."

"అయ్యో! అది సరే - మీ ప్రయాణం ఎక్కడికి? నా తప్పులు క్షమించండి! నన్ను వదిలి వెళ్ళకండి!" బావురుమంది వరలక్ష్మి.

రామానందం పెట్టె తీసుకు వెళ్ళిపోతూ అన్నాడు- "కొన్నాళ్ళిలా తిరిగి రావాలని వెడుతున్నాను."

"ఎన్నాళ్ళలో వస్తారు?"

"చెప్పలేను." రామానందం వెళ్ళిపోయాడు.

వారంరోజులు జరిగిపోయాయి. రామానందం తిరిగి రాలేదు.

ఎక్కడికి వెళ్ళాడో తెలియదు. ఎప్పుడు వస్తాడో తెలియదు.

'తన సూటి పోటీ మాటలతో అతని మనసు విరిగిపోలేదు గదా? సన్యాసుల్లో కలిసిపోలేదు గదా?' ఈ భావం వచ్చేసరికి వరలక్ష్మి నిలువెల్లా వణికిపోసాగింది. ఆత్మ పరిశీలన చేసుకోసాగింది.

'ఆయన్ని తిరిగి వెంటనే వచ్చేలా చెయ్యి భగవంతుడా! నేను ఇదివరకలా ప్రవర్తించను' అనుకుంటూ భర్త రాకకోసం ఎదురు చూడసాగింది వరలక్ష్మి. *

---


విజయ కథా నిలయం
చందా వివరాలు
(శ్రీకాకుళం)

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ" |
| అర్ధసంవత్సర చందా | 18 రూ" |
| విడి ప్రతి | 3 రూ" |